9440662699 | www.rajadhanivartalu.com | rajadhanivartalu | rajadhaniv | RNI No. APTEL 2015/ 66622 | స్థాపితం : 2015

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 7, పేజీలు 4 రూ. 2/- | ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | నవంబర్, సోమవారం 6- ఆదివారం 12, 2017

# వైభవంగా జగన్ పాదయాత్ర ఏర్పాట్లు

**రాజధాని వార్తలు ప్రతినిధి,ఇడుపులపాయ :** ప్రతిపక్షనేత వైఎస్ జగన్ 6 నుంచి ప్రారంభిస్తున్న ప్రజాసంకల్ప యాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు మూడువేల కిలోమీటర్ల మేరకు పాదయాత్ర సాగించనున్నారు. ఇడుపులపాయలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆ పార్టీ పెద్ద ఎత్తున నిర్వహించింది. వేలాది మంది ఇడుపులపాయకు తరలివస్తారని అంచనా. పాదయాత్ర నిర్వహించేందుకు వైఎస్ జగన్ ఈనెల 5న ఇడుపులపాయకు చేరుకున్నారు. 6 ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో తండ్రి సమాధి వద్ద నివాళులు అర్పించిన అనంతరం హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ట్రిపుల్‌ఐటీ మీదుగా రోడ్డుపైకి చేరుకొని మరోమారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. సమావేశం కోసం వైఎస్సార్ ఘాట్ సమీపంలో సాగుచేసిన గడ్డిని తొలగించి భూమిని చదును చేసి స్టేజి నిర్మాణం చేశారు. ఇడుపులపాయ నుంచి వైఎస్ జగన్ పాదయాత్రను ప్రారంభించనున్నందున ఆ ప్రాంతంలో అడుగడుగునా స్వాగత తోరణాలు ఏర్పాటుచేస్తున్నారు. వేంపల్లె నుంచి ఇడుపులపాయ వరకు ఉన్న 13 కిలోమీటర్ల మేరకు పలుచోట్ల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో పాటు వైఎస్ జగన్ ఫోటోలతో కూడిన స్వాగత తోరణాలను తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు చేయిస్తున్నారు. అలాగే స్థానిక నాయకులు పోటీపడి దారిపొడవునా వైఎస్ జగన్ ఫోటోలను, కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు.



ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**పాదయాత్ర సాగుతుందిలా**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి ఈనెల 6న ప్రారంభించి ప్రజా సంకల్ప యాత్ర జిల్లాలో ఆరు రోజుల పాటు సాగనుంది. ఇడుపులపాయ నుంచి వేంపల్లె మీదుగా వీరపునాయునిపల్లె మండలం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, దువ్వూరు మీదుగా కర్నూలు జిల్లా చాగలమర్రిలోకి పాదయాత్ర సాగుతుందని పార్టీ వర్గాల సమాచారం. రోజుకు కనీసం 14 కిలోమీటర్లు వీలుంటే అంతకంటే ఎక్కువ వైఎస్ జగన్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొదటి రోజు 13 కిలోమీటర్ల పాటు వేంపల్లె పట్టణ సమీపంలోని గండిరోడ్డులో మాలవంక సమీపంలో రాత్రికి వైఎస్ జగన్ పాదయాత్ర ముగించి బసచేయనున్నారు. ఇలా దారిపొడవునా ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాదయాత్రలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను, బాగోగులను వైఎస్ జగన్ తెలుసుకుంటారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పలుచోట్ల పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు ప్రజలనుద్దేశించి వైఎస్ జగన్ ప్రసంగిస్తారు.

**ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ అవినాష్**

ప్రజా సంకల్పయాత్రను విజయవంతం చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇడుపులపాయలో జరుగుతున్న ఏర్పాట్లను కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ కొండారెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి పరిశీలించారు. పెద్దఎత్తున జనం హాజరుకానున్నందున అందుకు తగ్గట్లు భోజన ఏర్పాట్లు, వైఎస్ ఘాట్‌లో నివాళులు అనంతరం సమావేశం స్టేజి నిర్మాణ పనుల పరిశీలన, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే మొదటి రోజు వేంపల్లె ప్రాంతంలో వైఎస్ జగన్ పాదయాత్ర సాగే రహదారిని పరిశీలిస్తూ మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసే ప్రాంతాలను పరిశీలించి అక్కడ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, జడ్పీటీసీ షబ్బీర్ వల్లి పాల్గొన్నారు.

డీజీపీతో ఉమ్మారెడ్డి, బొత్స, పార్థసారథిల భేటీ 2 లో

ఉపాధ్యాయుడంటే దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించే రేపటి పౌరులకు దిశానిర్ధేశకుడు. వారిలోని ఉత్సుకతను, జిజ్ఞాసను రేకెత్తించి సమాజగమనాన్ని ముందుకు నడిపించేవాడు అయితే ప్రభుత్వాల తీరుతో వారు వృత్తినుంచి, బోధించాల్సిన పాఠ్యాంశాల నుంచి తప్పుకొని తనవికాని పనులను నిర్వహిస్తూ వ్యధకు గురవుతున్న ఉపాధ్యాయుడి మనోగతం, మానసిక వ్యధ..




# చైతన్యానికి గోరీ

అమ్మ దీవెన, చేతులు కడిగించడం, నులిపురుగు మందులు మింగించడం, పల్లె నిద్ర, స్వచ్ఛభారత్, మరుగుదొడ్లు కట్టడం, శుభ్రం చేయడం, ఛైల్డ్ ఇన్‌ఫో, అమ్మకు వందనం, సమావేశాలకు హాజరు కావడం, సమాచారం అందించడం, రికార్డులు రాయడం, బియ్యం లెక్కలు చూడటం, రికార్డులున్నాయని రికార్డులు తయారు చేయడం, ఉపన్యాసాలు వినడం, టెలికాన్ఫరెన్స్‌లకు వెళ్లడం,రివ్యూలు రాయడం, రేడియో పాఠాలు చెవిదగ్గర పెట్టడంతోనే సరిపోతోందికాని, నాకోసం వచ్చే విద్యార్థులకు మనస్ఫూర్తిగా పాఠం చెప్పడానికి సమయం కెటాయించ లేకపోవడం నా దురదృష్టంగా భావిస్తున్నా..కార్పొరేట్ శక్తులకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం కంచె చేనేమేస్తున్న వైనాన్ని కళ్లకు కడుతోంది. హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం ఏటా జరిగే 'కపాల మోచన్ మేళా' కోసం 100 పాఠశాలల్లోని ఉపాధ్యాయులను 6 రోజుల పాటు పూజారులుగా, స్నానఘట్టాల్లో పురోహితులుగా పనిచేయాలని, హుండీ ఆదాయానికి పద్దులు రాయాలని, భక్తుల కానుకలను గోడౌన్లకు చేర్చాలని వారికి మూడురోజుల శిక్షణ ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయుడు అంటే నిస్తేజంగా, నిస్సత్తువగా నిలుస్తున్నాం ...మన్నించండి.. ఇది మా చేతకానితనంగా చరిత్రలో వక్రీకరించకండి. చేయని పాపాలను మాకంటించి అపప్రదను మా ఖాతాలో రాయకండి. ఇది సమాజపు నిద్రావస్థగా గుర్తించండి. ప్రైవేటు బడుల బస్సుల ఊర్లలోకి చొరబడి బందిపోటుల్లా బడిపిల్లలను దోచుకెళుతుంటే చూస్తే ఉండేందుకేనా నాకు జీతం? కిలకిలా రావాలతో, విద్యావికాసంతో పరిఢవిల్లిన ప్రాంగణాలు పిచ్చిమొక్కలతో జతకడుతుంటే ప్రాణం పోతున్నట్లే ఉంటోంది. ఓట్లనోట్లకు ప్రజాస్వామ్యాన్ని సమర్పిస్తుంటే ఈ వ్యవస్థలో నేనేంత ? నాబలమెంత ? జీవితం కోసం జీతం నా చైతన్యానికి గోరీ కడుతోంది. ఎలక్ట్రానిక్ యంత్రాలతో ప్రభుత్వం యంత్రాంగం నా చేతులను నిర్భధిస్తోంటే నేనేం చేయాలి ?

**విద్యా సుగంధాలతో బతుకులు మార్చే బడుగుల గుడులను కాపాడేందుకు కలసి అడుగులేసే సహచరులారా లేవండి, విద్యుల్లతల్లా జ్ఞానకాంతులు నలుచెరగులా సామాన్యుల చెంతకు చేర్చేందుకు ముందడుగు వేద్దాం.. దుండగులను ఎదిరించేందుకు దోపిడీని ఎండకట్టేందుకు దుర్నీతిపై సమరశంఖం పూరించేందుకు ..కదలిరండి... బడిపంతులు**

## ఈ నెల 11 వరకు శిల్పారామం చేనేత మేళా



**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకు కొనసాగే శిల్పారామం చేనేత మేళాను విజయవాడ మేరీస్ స్టెల్లా కాలేజీ ఇండోర్ స్టేడియంలో ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో 100కు పైగా చేతివృత్తుల పనివారు తయారు చేసిన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నామన్నారు. కొండపల్లి ,ఏటికొప్పాక, టెర్రాకోటా బొమ్మలతోపాటు, ఎంబ్రయిడరీ వస్త్రాలు, మెరుగులు దిద్దిన కుండలు ఉన్నాయన్నారు. గ్రామీణ చేతివృత్తుల వారికి ప్రోత్సాహమిచ్చేందుకు ఈ మేళాను ఏర్పాటు చేశామని శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చర్ సొసైటీ ప్రత్యేక అధికారి బి జయరాజు తెలిపారు. వెంకటగిరి, పెడన, మంగళగిరి, పోచంపల్లి, చీరాల తదితర ప్రాంతాల నుంచి కలంకారీ, బెంగాలీ కాటన్, కాశ్మీరీ సిల్క్ వస్త్రాలను ప్రజల సందర్శన, కొనుగోలు కోసం ఉంచామని ఇన్‌ఛార్జి ఆఫీసర్ డీ పార్థసారధి వెల్లడించారు.

## వైసీపీ ఎమ్మెల్యే రాజేశ్వరి డీటీపీ తీర్థం

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** వైసీపీ నుంచి మరో ఎమ్మెల్యే టీడీపీ చేరారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం వైసీపీ ఎమ్మెల్యే, వంతల రాజేశ్వరి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో శనివారం తన అనుచరులతో కలిసి చేరారు. దీంతో ఇప్పటి వరకూ వైసీపీని వీడిన ఎమ్మెల్యేల సంఖ్య 22కి చేరింది. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను పార్టీలో చేరినట్లు యధావిధిగా రాజేశ్వరి తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని జగన్ తీసుకున్న నిర్ణయం సరికాదని పేర్కొన్నారు.



**జగన్ వైఖరితో విసిగిపోయాం : కళా వెంకట్రావు**

నవ్యాంధ్ర అభివృద్ధికి అడుగునా ఆటంకాలు కల్పిస్తూ, ప్రతి ప్రాజెక్టుపైనా కోర్టును ఆశ్రయిస్తున్న వైఎస్ జగన్‌కు ఆ పార్టీ నాయకులే బుద్ధి చెబుతున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరి టీడీపీలో చేరడంతో మొత్తం 22 మంది వైసీపీ ఎమ్మెల్యేలు తెలుగుదేశాన్ని ఆశ్రయించగా, మరో ఐదుగురు చేరబోతున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్నూలు జిల్లా నుంచి ఒకరు, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లా నుంచి ఒక్కొక్కరు ఉన్నారని సమాచారం. వీరంతా 6న ఇడుపులపాయ నుంచి జగన్ పాదయాత్రను ప్రారంభించిన క్షణాన తెలుగుదేశం పార్టీలో చేరతారని తెలుస్తోంది. ఇందుకోసం ఏర్పాట్లు జరిగిపోయాయని, వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని టీడీపీ ఆఫర్ చేసిందని సమాచారం. శనివారం ఉదయం చంద్రబాబు నివాసం వద్ద ఏపీ టీడీపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు మాట్లాడుతూ, జగన్ వైఖరితో ఆ పార్టీ ఎమ్మెల్యేలు విసిగిపోయారని, అందువల్లే తమ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. అసెంబ్లీని బాయ్ కాట్ చేయడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రజా సమస్యలను ఎత్తి చూపి, వాటి పరిష్కారానికి నిర్మాణాత్మక సలహాలను ఇవ్వాల్సిన స్థితిలో ఉన్న విపక్ష పార్టీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడాన్ని ప్రజలే అసహ్యించుకుంటున్నారని ఆయన విమర్శించారు.

తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజధాని వార్తలు స్పెషల్ కరెస్పాండెంట్, ది హిందూ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్. ఇ









# రాజధాని పేదలకు 5,586 గృహాలు

## మొత్తం వచ్చిన దరఖాస్తులు 8,038

**రాజధాని వార్తలు ప్రతినిధి,తుళ్ళూరు :** అమరావతి రాజధాని గృహనిర్మాణ పథకం కింద ఇంటిస్థలం,ఇళ్ళు లేని 5,586 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ళు నిర్మించేందుకు సన్నాహాలు జరుపుతోంది. ఇళ్ళ నిర్మాణానికి రాజధాని ప్రాంత గ్రామాల్లో 8,038 ధరఖాస్తులు రాగా అధికారులు 5,586 మందిని అర్హులుగా తేల్చింది. ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి భూములు సమీకరించేటప్పుడు ఇళ్ళులేని పేదలకు ఉచితంగా ఇళ్ళు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని చెప్పింది.ఇందుకనుగుణంగా రాజధాని ప్రాంతంలో సర్వే నిర్వహించి ఇంటి స్థలం,ఇళ్ళులేనివారు సుమారు 7వేల వరకు ఉన్నట్లు అంచనాకు వచ్చింది.ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళ నిర్మాణానికి ప్రయత్నాలు జరిపింది. జూన్ 19న రాజధానిప్రాంతం, మండల కేంద్రమైన తుళ్ళూరులో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అమరావతి రాజధాని నిర్మాణ పథకానికి శంకుస్థాపన చేశారు.సీఆర్‌డీఏ సిబ్బంది ఆగష్టు 11నుంచి 17 వరకు ఇళ్ళులేని పేదలనుంచి దరఖాస్తులు స్వీకరించారు.ధరఖాస్తుల స్వీకరణ అనంతరం తుళ్ళూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించి వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించే పనిని అంగన్‌వాడీ.వెలుగు,పంచాయతీ కార్యదర్శిలు,విఆర్‌వోలకు అప్పజెప్పారు.ఎట్టకేలకు రాజధాని ప్రాంతంలో 5,586 మందిని నిజమైన అర్హులుగా తేల్చారు.ఇళ్ళ నిర్మాణ బాధ్యతను పట్టణ



నివాస సముదాయములు,మౌళిక సముదాయముల అభివృద్ధి సంస్థ(ఏపీ టిడ్కో)చేపడుతుంది.ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మూడు విభాగాల్లో జీప్లస్ 3 విధానంలో ఇళ్ళ నిర్మాణం జరుగుతుంది.300,365,430 చదరపు అడుగుల ఇళ్ళకు రూ5.74లక్షలు, 6.60,7.48లక్షలు యూనిట్ వ్యయంగా నిర్ణయించారు.ఈ మూడు కేటగిరీల్లో నిర్మించే ఏ ఇంటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ3లక్షలు మాత్రమే రాయితీ చెల్లిస్తాయి. మిగతా సొమ్మును లబ్దిదారులు బ్యాంకులకు వాయిదాలలో చెల్లించాలి. ఇళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వం ఉండవల్లి, పెనుమాక, ఐనవోలు, నిడమర్రు,

- మిగతా 2 లో



రాష్ట్ర రాజధాని అమరావతిలోని రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సరస్వతి దేవి విగ్రహం

రాజధాని వార్తలు కలం

పదం పరుషంగా ఉన్నా

# నిజాలను కాదనలేం

కంచ ఐలయ్య 2009 లో రాసిన పోస్టు హిందూ ఇండియాలోని ఒక అధ్యాయాన్ని తెలుగులో ' సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు 'గా భూమి బుక్ ట్రస్ట్‌గా ప్రచురించింది.సోషల్ స్మగ్లర్లు అని ఎందుకు రాయవలసి వచ్చిందంటే ఒక వ్యక్తి ఒక దేశం నుంచి మరొక దేశానికి అక్రమంగా డబ్బు తరలిస్తే అది స్మగ్లింగ్ లేదా అక్రమరవాణా అవుతుంది. ఇతరకులాల శ్రమశక్తిను ఒక కులం స్వంతం చేసుకొని దాన్ని మిగతా కులాలకు లేదా సమాజానికి చేరకుండా చేయడం స్మగ్లింగ్‌గా పేర్కొన్నానని ఆయన చెబుతున్నారు. 2006లో యూపీఏ ప్రభుత్వం ప్రైవేటు సెక్టార్‌లో రిజర్వేషన్ల అమలు సాధ్యాసాధ్యాల కోసం వీరప్ప మొయిలీ ఆధ్వర్యంలో ఒక కమిటి ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో సభ్యుడిగా ఐలయ్య అనేక కార్పొరేట్ సంస్థలను కలసుకుని రిజర్వేషన్ల అమలు కోరినప్పుడు మెరిట్‌లేని వారికి రిజర్వేషన్లు కల్పించడానికి కార్పొరేట్ పారిశ్రామిక వేత్తలు ససేమిరా అన్నారు. సంస్థల పనితీరు, ఉత్పత్తి సామర్థ్యం పడిపోతుందని వాదించారు. దీంతో ఆయన వారి లాభాల్లో 1లేదా 2 శాతాన్ని 'సామాజిక న్యాయం ఫండ్'లో కెటాయించి ఆదిమవాసీ,ఎస్సీ,బీసీ ప్రాంతాల్లో వారి పేర్లతోనే ఆసుపత్రులు, ఇంగ్లీషు మీడియం స్కూళ్లను 10 ఏళ్లపాటు నిర్వహించాలని కోరగా, దానికి వారు అంగీకరించలేదు. దీంతో ఆయన ఎవరి ప్రతిభ ఎంత అనేదానిపై రచనకు పూనుకొని ఆదీవాసీ,మాలలు, మాదిగలు, చాకలి, మంగలిల, గౌడ్, గొల్ల కుర్మలులపై రచనలు చేశారు. అదే విధంగా మనకు తెలియని ఇంజనీర్ల పేరుతో కంసాలీలు, చేనేత ఇతర కులాలపైనా, ఫుడ్ ప్రొడ్యూసర్ పేరుతో కమ్మ, రెడ్డి, కాపులవంటి శూద్రకుల అగ్రకులాల ప్రతిభాపాటవాలను నిర్వచించి గ్రామీణ వ్యవస్థను పొందుపరిచారు. దీని తర్వాత వచ్చేది కోమటోళ్లు, ఆపై బ్రాహ్మణుల గురించి పరిశోధనాత్మక పుస్తకం రాశారు. గుప్తరాజుల తర్వాత మాత్రమే వీరు వ్యాపారం సొంతం చేసుకున్నారని, అంతకు ముందు వారు కూడా పశుపోషణ,వ్యవసాయం చేశారని ఐలయ్య నిరూపిస్తున్నారు. అప్పటి నుంచి కింది కులాలు ఎదగటానికి లేకుండా వారు మాత్రం సమాజపరంగా అనేక సౌకర్యాలు సొంతం చేసుకున్నారని, ఇప్పటికీ దేశంలోని 43 శాతం సంపద బనియా ( కోమటి) కులం దగ్గర ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో జీఎంఆర్ ఆధిపత్యంలో ఉండగా, దేశంలో చూస్తే రిలయన్స్ సోదరులు ఉన్నవిషయాన్ని గుర్తుచేశారు. దేశవాసులకోసం పంటలు పండించిన రైతులు, శ్రమశక్తిని దేశానికి పరిశ్రమను ఆదుకుంటున్న కార్మికులు,దారుణమైన చలి, ఎండల్లో దేశరక్షణ చేసే జవాన్లు నానా బాధలు పడుతున్నారని చాటుతూ, వ్యాపారం పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థలో 46 శాతం సంపద కూడబెట్టిన వారిని సామాజిక స్మగ్లర్లుగా బుక్‌లెట్‌ను రూపొందించడం ఆయనకు చిక్కులు తెచ్చిపెట్టింది.

125 కోట్ల జనాభాలో అతికొద్దిమంది వ్యక్తుల వద్ద సమాజ సంపదను పేరుకుపోవడాన్ని ఆయన విమర్శించడాన్ని జీర్ణించుకోలేని మతోన్మాదులు హిందూకులంపై జరుగుతున్న దాడిగా పేర్కొంటూ ఆయనపై బురద జల్లడమే కాకుండా కులాల కుంపటి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దేశంలో కులాల కుంపటి పెట్టింది మనువు ఆయన్ని మాత్రం బుజాల కెత్తుకొని సర్వసుఖాలు అనుభవిస్తున్నవారు వారి భద్రతకు ముప్పు వస్తుందనే భయంతో ఐలయ్యను బూతులు తిడుతూ అగ్రకులం అసలు సిసలు అహంకారాన్ని బయట పెట్టుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం. ఆయనపై నిరసన చేయడానికి అనేక ప్రజాస్వామ్య పద్ధతులున్నా,ప్రభుత్వం,ఆయా సామాజిక వర్గం అందుకు అతీతంగా ప్రవర్తించారన్నది ప్రపంచానికి తెలుసు. ఐలయ్య ప్రవేశపెట్టిన నూతన అధ్యాయం బహుజనులను ఆలోచింప చేస్తోంది. బీసీనాయకుడు ఆర్‌కృష్ణయ్య, మాదిగ దండోరా అధిపతి మందా కృష్ణమాదిగ, కాపునాయకుడు ముద్రగడలంతా వ్యక్తిగత మైలేజ్‌కోసం కాకుండా బహుజన హితం కోసం అందరూ కలసి కృషి చేయాలి. బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే అదొక్కటే మార్గం.





## మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |


# ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వాలు

## మందుల కంపెనీలు, ప్రైవేటు ఆసుపత్రుల నిలువు దోపిడీ





దేశంలో ఆరోగ్య రంగం అత్యంత ఖరీదైనవిగా మారింది. ఎయిమ్స్, పీజీఐ చండీఘర్ లాంటి సంస్థలు తప్ప మిగతా ఆసుపత్రులన్నీ కుప్పకూలిపోయాయి. ప్రాథమిక ఆరోగ్య సంస్థలు కూడా సామాన్యుడికి అందకుండా పోయాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అసంఖ్యాకంగా జరుగుతున్న శిశుమరణాలు సామాజిక దయనీయ పరిస్థితులను కళ్లకు కడుతున్నాయి. 70 ఏళ్ల దేశస్వాతంత్ర్యంలో ఈ పరిస్థితుల పట్ల దేశప్రజలు మరింత సహనాన్ని అలవరచుకోవడం దురదృష్టకరం. ఈ విషయంపై చర్చలు జరపకుండా నోరు మూసుకోవడం దుర్గార్మానికి సహకరించడమేనని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ఈ దుస్థితికి కారణమైన వారు మాత్రం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. 'నేషనల్ హెల్త్ పాలసీ 2017' నివేదిక ప్రకారం రోగుల కుటుంబాలు చికిత్సకోసం వారి సర్వశక్తులూ ఒడ్డి 6 కోట్ల మంది అదనంగా దారిద్ర్య రేఖ దిగువకు చేరుకున్నాయి. ప్రభుత్వం వనరులను దుర్వినియోగం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆసుపత్రుల పాలైన 40 శాతం మంది అప్పుల్లో కూరుకు పోగా, 25 శాతం మంది చికిత్సకోసం వారి ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం వెళ్లాలన్నా, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నివాసిత ప్రాంతాలకు దూరంగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. దీనంతటికీ కారణం ప్రభుత్వం ఆసుపత్రుల నిర్వహణ సరిగ్గా చేపట్టకపోవడమేనని, చాలా ఆసుపత్రుల్లో డాక్టర్లు లేకపోవడం లేదంటే వారంతా ప్రైవేటు ఆసుపత్రుల్లో విధులు నిర్వహించడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. దేశం అంతటా కార్పొరేట్ ఆసుపత్రులు నెలకొల్పడంతో అక్కడే మంచి వైద్యం దొరుకుతుందనే తప్పుడు సంకేతం ప్రజలకు వెళ్లింది. అలాంటి ఆసుపత్రుల్లో ఎందరు వైద్యం కోసం ఖర్చుపెట్టగలరు ? నిజానికి ఇదంతా వైద్యాన్ని వ్యాపారం చేయడం మినహా ఇంకేమీ లేదు. దీంతో ఆరోగ్యరంగం కుదేలైంది. దీంతో సామాన్య రోగాలకు సైతం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆరోగ్యం సంరక్షణ విషయంలో స్వార్థప్రయోజనాలు తలెత్తడంతో నిర్ణయ విధాతలు కుంచితంగా వ్యవహరించి ప్రభుత్వ విధానాలను భ్రష్టు పట్టిస్తూ, సంస్కరణలకు తిలోదకాలిస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఆరోగ్యరంగంలో ప్రస్తుత పరిస్థితి పట్ల అత్యంత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం దురదృష్టకరం. రాజకీయనాయకులు, బ్యూరోక్రాట్లు ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలను పొందుతూ ప్రైవేటు ఆసుపత్రులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు, దీంతో సామాన్యులు, పేదవారు నానా అగచాట్లకు గురవ్వాల్సి వస్తుందని నివేదిక పేర్కొంది. ఒకవైపు కార్పొరేట్ ఆసుపత్రుల దందా, మరొకవైపు మందుల ధరలు సామాన్యుడిని పీల్చిపిప్పిచేస్తున్నాయని, మందుల రేట్ల విషయంలో సరైన విధానం రూపొందించకపోవడమే దీనికి కారణంగా నివేదిక తెలిపింది. 10 రూపాయల మందును 100 రూపాయలకు అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువ ధరకు కొనాల్సి వస్తోంది. మందులకంపెనీలు, ఆసుపత్రులు ముక్కుపిండి చేస్తున్న వసూళ్లను రోగులు మోసపోయామని తెలుసుకున్నప్పటికీ ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోతున్నారని నివేదిక పొందుపరచింది.

మంచి ఆరోగ్యం కలిగి ఉండటం మానవ హక్కు, ప్రభుత్వం వారి ఆరోగ్యానికి భరోసా ఇవ్వకపోవడం అంటే వారి ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమే. ప్రతి ఏడాది ప్రభుత్వం వేల కోట్లు ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్నప్పటికీ అది చేరవలసిన వారికి చేరడం లేదు. అంటే ప్రజలకు ఉపయోగపడటం లేదు. న్యాయబద్ధంగా, బాధ్యతాయుతంగా ఈ కేటాయింపులు ఖర్చు పెడితే తప్పకుండా సామాన్యుడికి మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. జిల్లా ముఖ్యకేంద్రాల్లో ప్రభుత్వం నడుపుతున్న ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించి చాలినన్న నిధులు కెటాయిస్తే అరకొర సౌకర్యాలుండే ప్రైవేటు ఆసుపత్రులకు ప్రజలను వెళ్లవలసిన అవసరం ఏముంటుంది ? ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో జాగరూకతతో వ్యవహరించాలి. ఈ పరిస్థితి నుంచి పాఠాలు నేర్చుకొని బయటపడేందుకు ప్రయత్నించాలని నివేదిక స్పష్టం చేసింది.

- ఎస్‌కే ఇమ్రాన్

## లంబసింగిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు



**విశాఖపట్నం :** విశాఖ మన్యంలోని లంబసింగిలోని మోదకొండమ్మ పాదాలు, లంబసింగిల్లో 10, అరకు, పాడేరు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో 13 డిగ్రీలు నమోదయ్యాయి. హైదరాబాదు, రామగుండం, వరంగల్ తదితర జిల్లాల్లో 18 డిగ్రీలు, విశాఖపట్టణంలో 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అరకు, పాడేరు ప్రాంతాల్లో వలిసె పూలు పర్యాటకులను అలరిస్తుండగా, లంబసింగిలో వాతావరణంలో మార్పులను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. కార్తీక మాసం కావడంతో పర్యాటకుల రద్దీ పెరుగుతోంది.

# ఆస్పత్రిలో గద్దె అనురాధ ఆకస్మిక తనిఖీలు



**రాజధాని వార్తలు ప్రతినిధి,విజయవాడ :** ప్రభుత్వాస్పత్రి పనితీరు మరోసారి బయటపడింది. ప్రాణాపాయస్థితిలో చికిత్స కోసం క్యాజువాలిటీకి వచ్చిన రోగికి వెంటిలేటర్ అవసరం కాగా, అందుబాటులో లేకపోవడంతో రెండు గంటలపాటు అలాగే వదిలేశారు. ఆ సమయంలో ప్రభుత్వాస్పత్రికి వచ్చిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ దృష్టి ఆ రోగిపై పడింది. అతనికి ఏమైందని ప్రశ్నించగా, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందని, వెంటిలేటర్ పెట్టాల్సి ఉన్నా అందుబాటులో లేవని చెపుతున్నట్లు బంధువులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె వైద్యులను నిలదీశారు. క్యాజువాలిటీలో రెండు వెంటిలేటర్‌లు ఉండగా, ఒకటి పనిచేయడం లేదని, మరొకటి వేరే రోగికి పెట్టినట్లు తెలిపారు. వెంటనే రోగిని వెంటిలేటర్‌పై ఉంచాలని ఆదేశించడంతో ట్రామా కేర్‌లో ఉన్న వెంటిలేటర్‌ను తీసుకు వచ్చి ఆ రోగికి పెట్టారు.అనంతరం సిటీ స్కాన్‌తోపాటు, అవుట్ పేషెంట్ విభాగాన్ని అనూరాధ పరిశీలించి, రోగులను సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మోకీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు ఎందుకు నిర్వహించడం లేదని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ డి.వెంకటేష్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాక పోవడంతో నిర్వహించలేకపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**స్వచ్ఛంధ సంస్థల సేవలు అభినందనీయం**

ప్రభుత్వాస్పత్రిలో శ్రీ వాసవీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా చపాతీలు అందించడం అభినందనీయమన్నారు. ఆమె చపాతీ తయారీ ప్లాంటును సందర్శించి వారు అందిస్తున్న సేవలు ప్రసంశించారు. మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో సైతం ఇలాంటి పథకం అమలు చేసేందుకు కృషి చేయాలని సేవా సమితి నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ప్రభుత్వాస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భీమేశ్వర్, ఆర్‌ఎంఓ డాక్టర్ గీతాంజలి, డాక్టర్ భవానీశంకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు దివి ఉమామహేశ్వరరావు, ముమ్మినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని పేదలకు 5,586 గృహాలు

(మొదటిపేజీ తరువాయి)

తుళ్ళూరు, నవులూరు, నేలపాడు, మందడం, బోరుపాలెం, అనంతవరంలో ఒక్కో గ్రామంలో 5 ఎకరాల చొప్పున 50 ఎకరాలు కేటాయించింది.ఇందుకనుగుణంగా ఇళ్ళనిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. తుళ్ళూరు-దొండపాడు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఇళ్ళ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రదేశంలో లేఅవుట్‌ను రూపొందించారు.ఇక్కడ భూగర్భ జలాలు ఏవిధంగా ఉన్నాయో సర్వే జరిపారు.త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

**రాజధాని ప్రాంతంలో ఎంపికైన ఇళ్ళ సంఖ్య..**

కృష్ణాయపాలెంలో 167 మంది ఇళ్ళ నిర్మాణానికి ధరఖాస్తు చేసుకోగా 140 మందిని అధికారులు అర్హులుగా తేల్చారు.బేతపూడిలో 196 ధరఖాస్తులు రాగా 152,నవులూరులో 865 ధరఖాస్తులకు గానూ 487,ఎర్రబాలెం 888 గానూ 642,కురగల్లులో 285కి 144,నీరుకొండకు సంబంధించి 154 రాగా,84,నిడమర్రు 370కి 169,ఉండవల్లిలో 1073 ధరఖాస్తులు రాగా,826,పెనుమాకలో 562కు గానూ 330,అబ్బరాజుపాలెంలో 30కి 30,బోరుపాలెంలో 139కి 96,దొండపాడులో 155కి గానూ 117,ఐనవోలులో 173కి 141,రాయపూడికి సంబంధించి 331 ధరఖాస్తులు రాగా 199,లింగాయపాలెంలో 123 మంది ధరఖాస్తు చేసుకోగా 101 మందిని,మల్కాపురం 107 మందికి 91 మందిని, ఉద్దండ్రాయునిపాలెంలో 119 మందికి గానూ 93 మందిని,నెక్కల్లులో 127కి 58,నేలపాడులో 133 మందికి 118,శాఖమూరులో 107కి 70,తుళ్ళూరులో 587 మందికి 343,వెలగపూడిలో 94కి 79,వెంకటపాలెంలో 351కి 329,మందడంలో 667కి 640,అనంతవరంలో 235 మంది ధరఖాస్తు చేసుకోగా 107 మందిని అర్హులుగా తేల్చారు.అర్హులుగా తేల్సినవారిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1290 మంది,365 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1453 మంది,430 చదరపు అడుగుల విస్తీర్ణంలో 2843 మంది ఇళ్ళు నిర్మించుకొన్నారు.

# మురికివాడల్లేని నగరంగా అమరావతి

**సీఆర్‌డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు**

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** మురికి వాడల్లేని నగరంగా అమరావతిని నిర్మించాలని, ప్రణాళికాబద్ధమైన సిటీగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సీఆర్‌డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నగరం ఏవిధంగా వుండాలనే దానిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధాని నగర నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుండి అతిక్రమణలు, ఆక్రమణలకు తావులేకుండా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. అలాగే మాస్టర్‌ప్లాన్‌ను అనుసరించి రాజధాని నిర్మాణం జరిగేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ రాజధానికి లేని వనరులు, వసతులు అమరావతి సొంతమని, దీనిని సద్వినియోగం చేసుకుని సుందర నగరంగా రూపొందించుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన నగరాలను నమూనాగా తీసుకొని, వాటికి ధీటుగా వుండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ లైన్లు అన్నీ అండర్‌గ్రౌండ్ ద్వారానే చేపట్టాలని, డ్రైనేజీకి అదే పద్ధతిని అవలంభించాలని, రహదారులు, పుట్‌పాత్‌లు, పార్కులు అన్నీ ప్రత్యేకతను సంతరించుకునేలా వుండాలని ఆకాంక్షించారు. అన్నింటికి మించి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించే గృహ సముదాయాలు, పరిపాలనా భవనాలపై మరింత శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో జరిగే రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకి కొన్నిచోట్ల భూసేకరణ సమస్యలున్నాయని, వాటిని త్వరలోనే పూర్తిచేసి రహదారి నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పారు. ఇప్పటివరకు అమరావతి పరిధిలో ఇంటర్నేషన్ కంపెనీలకు చెందిన 10 హోటల్స్ నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారని, 2020కి ఇవన్నీ పూర్తయ్యే అవకాశముందని చెప్పారు.అలాగే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి 42 ఎకరాలు గుర్తించామని, సుమారు రూ.1220 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈసమావేశంలో మున్సిపల్‌శాఖా మంత్రి పి.నారాయణ, అమరావతి డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ లక్ష్మీ పార్థసారధి భాస్కర్, ప్రిన్సిపల్ సెక్రటరీస్ అజయ్ జైన్, సతీష్ చంద్ర పాల్గొన్నారు.

**వేగంగా పేదల ఇళ్ల నిర్మాణాలు : మంత్రి కాల్వ శ్రీనివాసులు**

రాష్ట్రంలో పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖ 13 జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లతో సమావేశమై రాష్ట్రంలో పథకం పనితీరును సమీక్షించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు చక్కటి పనితీరు కనపరిచిన శాఖ సిబ్బందికి ఇంకా భారీ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చడానికి రూ.19 వేల కోట్లతో 13 లక్షల ఇళ్లు కట్టిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు నియోజకవర్గాల వారీగా, అవసరమైన చోట్ల మండలాల వారీగా సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. 2014 కంటే ముందు మంజూరై, నిర్మాణం పూర్తి కాని ఇళ్లు 2.60 లక్షలు ఉన్నాయని, వాటిలో 1.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# డీజీపీతో ఉమ్మారెడ్డి, బొత్స, పార్థసారథిల భేటీ



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవంబర్ 6 నుంచి చేయతలపెట్టిన ప్రజా సంకల్పయాత్ర నేపథ్యంలో పార్టీ కీలక నేతలు శనివారం ఏపీ డీజీపీ సాంబశివరావును కలిశారు. సీనియర్ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ, పార్థసారథిలు.. ప్రజా సంకల్పయాత్రకు సంబంధించిన పలు వివరాలను డీజీపీకి తెలిపారు. భేటీ అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు.

**డీజీపీ సానుకూల స్పందన :** వైఎస్ జగన్ పాదయాత్రకు సంబంధించి తాము చెప్పిన వివరాలకు డీజీపీ సానుకూలంగా స్పందించారని వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ చెప్పారు. యాత్రకు అనుమతి తీసుకోవాలనే ప్రశ్నే ఉత్పన్నం కాబోదని మరోసారి స్పష్టం చేశారు. "ప్రభుత్వ వైఫల్యాలను, అప్రజాస్వామిక విధానాలను తెలియజెప్పడానికే జగన్ ప్రజల్లోకి వెళుతున్నారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడానికే సంకల్ప యాత్రను చేపట్టారు" అని అన్నారు.

**భద్రత కొనసాగించాల్సిందే :** వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్రపై టీడీపీ సర్కార్ కుట్రలు పన్నుతున్న దరిమిలా జననేతకు యాత్ర పొడవునా భద్రత కొనసాగించాల్సిందేనని వైఎస్సార్‌సీపీ నేతలు డీజీపీని కోరారు. ప్రస్తుతం జగన్‌కు భద్రత ఉన్నా, పాదయాత్ర ప్రారంభమైన తర్వాత దానిని ఉపసంహరించుకుంటారనే అనుమానాల నడుమ నేతలు ఈ విధంగా పేర్కొన్నారు. నవంబర్ 6 నుంచి ప్రారంభం కానున్న ప్రజా సంకల్పయాత్ర ఆరు నెలల పాటు సాగనుంది.

**కోర్టు ఆదేశాలమేరకు అనుమతి ఉంటుంది : డీజీపీ**

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తలపెట్టిన ప్రజా సంకల్ప యాత్రకు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి అనుమతులు ఉంటాయని డీజీపీ సాంబ శివరావు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాకు వెల్లడించారు. పాదయాత్ర వివరాలను, రూట్ మ్యాప్‌లను ఆయా జిల్లాల ఎస్పీలకు ముందుగానే అందజేయాలని సూచించారు.

# 10 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- నోటిఫికేషన్ జారీ
- అంతా ఏకపక్షమే

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈనెల 10 నుంచి ప్రారంబమవుతాయి. ఆ రోజున అసెంబ్లీ ఉదయం 9.40 గంటలకు. శాసనమండలి 10.30 గంటలకు ప్రారంభమవుతాయని గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్ నోటిఫికేషన్ జారీచేశారు. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించేదీ సభావ్యవహారాల సలహాసంఘం (బీఏసీ)లో నిర్ణయిస్తారు. ఇదిలా ఉండగా ఈ సారి జరగనున్న అసెంబ్లీ సమావేశాలను ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులు బహిష్కరించేందుకు నిర్ణయించారు. ప్రభుత్వం సక్రమంగా స్పందించటం లేదని, సభలో తాము మాట్లాడేందుకు మైక్ ఇవ్వటం లేదని, వైసీపీ నుండి టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన 22 మంది శాసనసభ్యులపై చర్యలు తీసుకోని కారణంగా శాసనసభ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ఇప్పటికే అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ప్రతిపక్ష సభ్యులు హాజరు కాకుండా జరగనున్న అసెంబ్లీ సమావేశంగా రికార్డులకు ఎక్కనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రతిపక్ష లేకుండా అసెంబ్లీ సమావేశాలు ఎన్నడూ జరగలేదు. అధికారపక్షం, మిత్రపక్షం సభ్యులతోనే ఈసారి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.

# ఈ పిల్లలు సాహసవీరులు




పిల్లల గురించి ఈ తరం తల్లిదండ్రులలు చెప్పేమాటేమిటంటే మాట వినరు.. ఎదురు సమాధానాలు చెబుతారు.. టీవీ నుంచి కదలరు. మొబైల్‌లో గేమ్స్ ఆడుతుంటారు. చదవరు... లాంటివన్నీ చెబుతారు. నిజానికి సరైన మార్గదర్శనం చేస్తే వారు చేయలేనిందంటూ ఉండదు. అందుకు ఉదాహరణగా నిలుస్తారు తెలంగాణ మైనార్టీ గురుకులాలకు చెందిన నలుగురు విద్యార్థులు. ఎత్తైన పర్వతాల్లో ఒకటైన ఆఫ్రికాలో టాంజానియాలోని కిలిమంజారో పర్వత శిఖరాన్ని వారు అధిరోహించారు. అక్టోబరు 20 నుంచి 25 వరకు ఆ దేశంలో పర్యటించిన విద్యార్థులు ఈ ఘనత సాధించారని మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి బి షఫీయుల్లా తెలిపారు. సంగారెడ్డి, వరంగల్ గురుకుల బాలుర పాఠశాలల విద్యార్థులు డి.భాస్కర్, ఎస్.కె.ఫెరోజ్,.. బోధన్, గజ్వేల్ బాలికల గురుకుల పాఠశాలల విద్యార్థినులు సిద్రా తుల్ ముంతాహ, బి.రాణి పర్వతాన్ని అధిరోహించిన బృందంలో ఉన్నారు. పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు విజయసూచికగా జాతీయపతాకాన్ని, మైనార్టీ గురకులాల సొసైటీ లోగోను ప్రదర్శించారు. శెహభాష్ పిల్లలూ...

## ఆమె




కిలిమంజారోపై పదేళ్ల కామ్యా కార్తికేయన్

విశాఖకు చెందిన పదేళ్ల చిన్నారి కామ్యాకార్తికేయన్ ఆఫ్రికాలోనే అతి ఎత్తయిన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించింది. సాహస్ పేరిట నిర్వహించిన యాత్రలో భాగంగా ఆమె ఆ పర్వతాగ్రానికి చేరుకుంది. సముద్ర మట్టానికి 718,652 అడుగుల ఎత్తున ఉన్న కిలిమంజారో శిఖరారోహణకు ఆమె మరంగు అనే ప్రాంతం నుంచి అక్టోబరు 21వ శ్రీకారం చుట్టింది. నాలుగు రోజుల నడక అనంతరం 25న లక్ష్యం చేరుకుంది. ఆమెకు తోడుగా తల్లి లావణ్యా కార్తికేయన్ కూడా ఈ శిఖరాన్ని అధిరోహించారు. చిన్నారి కామ్య గతంలో 17,600 అడుగుల ఎత్తునున్న ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకు వెళ్లి ఆ ఘనత సాధించిన రెండో బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది. గత ఆగస్టులో కశ్మీర్‌లోని 20 వేల అడుగుల ఎత్తున ఉన్న స్టాక్ కాంగ్రీ పర్వత శిఖరాన్ని చేరి, ఆ కీర్తి గడించిన మొదటి బాలికగా ప్రపంచ రికార్డును సృష్టించింది. తాజాగా నరాలు కొరికే తీవ్ర చలిగాలులు, మంచుతో నిండిన నడకమార్గాలు, ప్రమాదకరమైన పర్వత వాలులను అధిగమిస్తూ కామ్యా కిలిమంజారో శిఖరాన్ని చేరుకుంది. చిరు ప్రాయంలోనే ఆ ఖ్యాతి గడించిన భారతీయ బాలికగా రికార్డు సాధించింది. తూర్పునౌకాదళంలో కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కార్తికేయన్ కుమార్తె కామ్యా తాజా రికార్డు పట్ల నౌకాదళ అధికారులు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు.

## అంతర్‌రాష్ట్ర మండలి పునర్వ్యవస్థీకరణ

### చంద్రబాబు సహా ఏడుగురు సీఎంలకు చోటు

**న్యూఢిల్లీ :** అంతర్‌రాష్ట్ర మండలిని పునర్నిర్మించారు. రాష్ట్రాల మధ్య ఏర్పడిన విభేదాలపై ఈ మండలి దర్యాప్తు చేస్తుంది. సూచనలు ఇస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ మండలిని అధ్యక్షునిగా వ్యవహరిస్తారు. ఆరుగురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులందరూ ఈ మండలిలో సభ్యులుగా వుంటారు. ఈ మేరకు గజిట్‌నోటిఫికేషన్ వెలువడింది. పునర్వ్యవస్థీకరించిన అంతర్‌రాష్ట్ర మండలిలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్(హోం), సుష్మాస్వరాజ్(విదేశీ వ్యవహారాలు), అరుణ్‌జెట్లీ (ఆర్థిక) , నితిన్ గడ్కరి (రోడ్డు రవాణా), టీసీ గెహ్లాట్ (సామాజిక న్యాయం, సాధికారత), నిర్మలా సీతారామన్ (రక్షణ) సభ్యులుగా ఉన్నారు. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. మరో 8 మంది కేంద్ర మంత్రులు ఈ అంతర్ రాష్ట్ర మండలిలో శాశ్వత ఆహ్వానిక సభ్యులుగా వుంటారు. ఆరు సురేష్ ప్రభు (వాణజ్య) రాంవిలాస్ పాశ్వాన్ (ఆహార), హరసిమ్రత్ కౌర్ బాదల్(ఆహార శుద్ధి పరిశ్రమలు),జూయల్ ఓరం (గిరిజన వ్యవహారాలు), ప్రకాష్ జవదేకర్ (హెచ్‌ఆర్‌డీ), ధర్మేంధ్ర ప్రధాన్ (పెట్రోలియం), పియూష్ గోయెల్ (రైల్వే). రాజ్యాంగంలోని 263 అధికరణ అంతర్‌రాష్ట్ర మండలి ఏర్పాటుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు విచారణ జరిపి, తగిన సలహాలు ఇస్తుంది. వివాదాలు, కార్యాచరణ సంబంధించి మరింత ఉత్తమ సమన్వాయం కోసం సిఫార్సులు కూడా చేస్తుంది. వివాదాలు తలెత్తినప్పుడు తగిన సూచనలు చేస్తుంది. ప్రభుత్వం మరొక నోటిఫకేషన్‌లో అంతర్‌రాష్ట్ర మండలి స్థాయి సంఘాన్ని కూడా పునర్నిర్మించింది. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ స్థాయి సంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. నలుగురు కేంద్ర మంత్రులు ఏడుగురు ముఖ్య మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. కొత్త స్థాయి సంఘంలో కేంద్ర మంత్రులు సుష్మాస్వరాజ్, జైట్లీ, గడ్కరీ. గెహ్లాట్, ముఖ్యమంత్రులు ఎన్. చంద్రబాబునాయుడు (ఆంధ్రప్రదేశ్), అమరిందర్ సింగ్ (పంజాబ్), రమణ్‌సింగ్ (చత్తీస్‌ఘడ్), మాణిక్ సర్కార్ (త్రిపుర), నవీన్ పట్నాయక్ (ఒడిశా), వసుంధరరాజే (రాజస్థాన్)యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్) సభ్యులుగా ఉన్నారు. అంతర్‌రాష్ట్ర మండలి పరిశీలించిన అంశాలపై స్థాయి సంఘం సంప్రదింపులు జరిపి, సిఫార్సులు చేస్తుంది.

## వచ్చేది పేదలు, రైతుల ప్రభుత్వం



**జంబూసర్ :** గుజరాత్‌లో వచ్చేది పేదల ప్రభుత్వమేనని,మోడీకి చెందిన పారిశ్రామికవేత్తల ప్రభుత్వం కాదని కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. గుజరాత్‌లో ఏ వర్గం ప్రజలూ బీజేపీ ప్రభుత్వం పట్ల సంతృప్తిగా లేరన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీపై దేశవ్యాప్తంగా అగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వచ్చే నెలలో శాసనసభ ఎన్నికల జరగనున్న గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలోని జంబూసర్ నుంచి బుధవారం రాహుల్ ఎన్నికల ప్రచారాన్ని తిరిగి ప్రారంభిస్తూ ఒక ర్యాలీలో ప్రసంగించారు. సరళ వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో భారత స్థానంపై బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన ఎద్దేవా చూస్తూ,నోట్ల రద్దు దెబ్బ, జీఎస్టీ హడావుడి అమలు కారణంగా చిన్న వ్యాపారులు ఎలా ఇబ్బందులు పడుతున్నారో చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. రాష్ట్రంలోని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు అశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. 'ఐదు లేదా పది మంది బడా పారిశ్రామికవేత్తలు ప్రయోజనాలు పొందుతుండగా' చిన్న రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'ఆ ఐదు లేదా 10 మంది పారిశ్రామికవేత్తలు, వారి పేర్లు ప్రస్తావించను. వారు ప్రతి రంగంలోనూ ఉన్నారు. గుజరాత్ ఎన్నికలల్లో బీజేపీ షాక్ తగలబోతుంది. ప్రజలు వాస్తవాలు గ్రహించారు. మోడీకి చెందిన పారిశ్రామివేత్తలు కాదు. రైతులు, పేదలు, వ్యాపారులకు గుజరాత్‌లో ఉద్యోగాల సృష్టి జరగబోతుంది' అని రాహుల్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు కురిపిస్తూ, మోడీ 'మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తి, ఉద్యోగ కల్పన పథకాలు మొత్తం విఫలమయ్యాయని అన్నారు. ' కొన్ని గణాంకాలు ఇస్తాను. భారత్,చైనా ప్రజల దాదాపు ఒకే సంఖ్యలో ఉన్నారు. కానీ చైనాలో ఏటా 50 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుంటే, భారత్‌లో కేవలం 450గా మాత్రమే ఉంది. 30లక్షల మంది గుజరాతీలు నిరుద్యోగులుగా ఉన్నారు' అని విమర్శించారు.

## 15 నుంచి విశాఖలో వ్యవసాయ సాంకేతిక సదస్సు

### ముగింపు సభకు బిల్ గేట్స్

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** విశాఖపట్నంలో మూడు రోజుల పాటు ఈ నెల 15 నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సాంకేతిక సదస్సు – 2017ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం నిర్వహించే ఈ సదస్సులో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణయ ప్రతినిధులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారన్నారు. మూడు రోజులపాటు వ్యవసాయ సాంకేతిక అంశాలకు సంబంధించిన పోటీ, గ్రామీణ సలహాల సేవలు, మార్కెటింగ్, క్రెడిట్, డేటా సేకరణ, దాని పూర్తి స్థాయి వినియోగం వంటి అంశాలను చర్చిస్తారని వివరించారు.

## ఏపీకి మొండిచెయ్యి

### రాష్ట్రాలకు కేటాయింపుల్లో కేంద్రం అలక్ష్యం



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు జరిగే పథకాలకు కేటాయింపుల్లో కేంద్రం అలక్ష్యం ప్రదర్శిస్తోంది. మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయలేదని కొన్ని రాష్ట్రాలకు నిదులు జారీ చేయని పరిస్థితి ఉంది. మరి కొన్ని రాష్ట్రాలకు కేటాయింపులు జరపడంలో రాజకీయ వివక్ష చూపుతోందనీ విమర్శలు వినవస్తున్నాయి. ఎం.గోవిందరావ రూపొందించిన ప్రభుత్వ నివేదికలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు కేటాయిస్తున్న తీరు తెన్నులను వివరించారు. నిధుల కేటాయింపుల్లో అలక్ష్యమూ, వివక్షా తదితర కారణాలను సోదాహరణంగా ఆయన పేర్కొన్నారు. కేంద్రం నుంచి నిధులు అందుకుంటున్న రాష్ట్రాలను మూడు తరగతులుగా వర్గీకరించారు. 30 శాతం నిధులు నిర్దేశించిన ఆరు కాలను అత్యంత కీలకమైనవిగానూ, 40 శాతం నిర్ధేశించిన 22 పథకాలను కీలకమైనవిగానూ, 45 పథకాలను ఐచ్ఛికాలుగానూ వర్గీకరించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ ఆరోగ్యపథకం (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం),14 వ ఆర్థిక సంఘం సిఫారసుల తరువాత రాష్ట్రాలకు పన్నుల వాటాను కేంద్రం 32 శాతం నుంచి 42 శాతానికి పెంచింది. అదే విధంగా సాధారణ పనుల్లో వాటాను 2014-15లో 55.5ఉండగా 2017-18 ఆర్థిక సంవత్సరానికి దాన్ని 72 శాతానికి పెంచింది. ఈ సాధారణ పనులకు కేటాయించే నిధుల మీద ఎలాంటి షరతులూ లేవు ఆర్థిక సంఘం సిఫారసు మేరకే ఈనిధుల బదలాయింపును కేంద్ర జరుపుతోంది. రాష్ట్రాల సామాజిక సూచీల అభివృద్ధికి ఉద్దేశించిన ప్రత్యేక నిధుల కేటాయింపులు తగ్గిపోయాయి. రాష్ట్రాల రెవెన్యూ పెరిగినందునే ఇలా నిధులను తగ్గించాల్సి వచ్చిందన్న విచిత్ర వాదనను కేంద్రం వినిపిస్తోంది. అదనంగా సమకూర్చుకుంటున్న రెవెన్యూ నుంచి కొంత భాగాన్ని ఆయా రాష్ట్రాలు తమ పరిధిలో అమలు జరిపే పథకాలకు వెచ్చించుకోవాలనేది కేంద్రం వాదన. ఈవాదనను పరిశీలిస్తే అన్ని రాష్ట్రాల ఆదాయాలూ ఒకే విధంగా లేవు. రాష్ట్రాల ఆదాయ వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోకుండా అన్ని రాష్ట్రాలనూ ఒకే గాటన కట్టిన కేంద్రం వైఖరి అనేక రాష్ట్రాల్లో పథకాలను కుంటుపరుస్తోందని నివేదిక వ్యాఖ్యానించింది....

ప్రాథమిక విద్య, ప్రజారోగ్య రంగాల్లో ఎంతగానో పురోగతి సాధించిన కేరళ విద్యాపరంగా బాగా వెనుకబడిన బీహార్ ఒకే తీరులో మ్యాచింగ్ గ్రాంటును సమకూర్చాల్సి రావడం అసాధ్యమైన సంగతిగా తెలిపింది. మ్యాచింగ్ గ్రాంటును సమకూర్చలేని బీహార్‌కు చాలినన్ని నిధుల కేటాయింపులు చేయడం లేదని నివేదిక తెలిపింది.

పేద రాష్ట్రాల ప్రయోజనాలకు నష్టం కలిగించే రీతిలో కేంద్రం నిధుల పంపిణీ నిబంధనలు ఉన్నాయని నివేదిక ఆక్షేపించింది. పేద రాష్ట్రాల సగటు తలసరి ఆదాయం కంటే ఐదు రెట్లు ఎక్కువ సగటు తలసరి ఆదాయం పొందుతున్న సంపన్న రాష్ట్రాల మధ్య ఆర్థిక అంతరాలు మరింతగా పెరిగేందుకు దోహదపడేలా కేంద్రం అనుసరిస్తున్న విధానమున్నట్లు నివేదిక తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాల్లో సమతుల్యత సాధించడమనేది భారత్ రాజకీయ వ్యవస్థలో అసాధ్యమైన వ్యవహారంగా కనిపిస్తోందని నివేదిక వ్యాఖ్యానించింది. విద్య, ప్రజారోగ్య రంగాల్లో పేద రాష్ట్రాలు నిధుల కొరత సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయని వివరించింది. నిధుల కొరత కారణంగా పలు రాష్ట్రాల జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం), మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గణాంకాలను పరిశీలించినపుడు నిధుల లేమితో ఆయా రాష్ట్రాలు ఎంతగా అవస్థలు పడుతోంది. స్పష్టంగా తెలుస్తుందని నివేదిక తెలిపింది.

## వడ్డీ రేట్లు తగ్గాయ్

### గృహ, కారు రుణాలపై 5 బేసిక్ పాయింట్ల ఊరట

**ముంబై :** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గృహ, కారు రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. రిటైల్ రుణాలను పెంచేందుకు రుణాల రేట్లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. నవంబరు 1 నుండి కొత్త వడ్డీరేట్లు అమలులోకి రానున్నాయి. కొత్త వడ్డీరేట్ల ప్రకారం 8.30 శాతం గృహరుణాలకు, 8.75 శాతంగా ఉన్న ఆటో రుణాలను 8.70శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఈ వడ్డీరేట్లు రూ.30 లక్షల వరకు ఉన్న రుణాలకు వార్షిక వడ్డీరేటు 8.30 శాతంగా నిర్ణయించింది. అన్నింటిపైనా 5 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న ఏడాది ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీరేట్లను కూడా బ్యాంకు తగ్గించింది. ఇప్పటివరకు అమలులో ఉన్న 6.5 శాతం ఉన్న వడ్డీరేటును 6.25శాతానికి తగ్గించింది. ఎంసీ ఎల్‌ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్‌డ్ లెండింగ్ రేట్స్) కింద ఉనన రుణాలపై ఇప్పటివరకు ఏడాదికి 8 శాతం వడ్డీరేటు ఉండగా దాన్ని 7.95శాతానికి తగ్గించింది. ఈ నిబంధనలు తాజాగా రుణాలు తీసుకునే వారికి మాత్రమే వర్తించనున్నాయి. రేటు రుణ మొత్తం ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడి ఉంటుందు ఎస్‌బీఐ వెల్లడించింది.

### బంగారు ఆభరణాలపై

## 'హాల్‌మార్క్' ఉండాల్సిందే

### జనవరి నుంచి అమలుకు కేంద్రం యోచన



**న్యూఢిల్లీ :** దేశంలో అమ్మే బంగారు అభరణాలకు 'హాల్‌మార్క్'(నాణ్యత ముద్ర)తో పాటు కారట్ కౌంట్‌ను తప్పనిసరి చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక చేస్తోందని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ తెలిపారు. 'ప్రస్తుతం ప్రజలు వారు కొనుగోలు చేసే బంగారు ఆభరణాల నాణ్యతను తెలుసుకోవడం లేదు. దీంతో బంగారు ఆభరణాలకు హాల్‌మార్క్‌ను తప్పనిసరి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నాం. ఇది జనవరి నుంచి అమలు కావచ్చు' అని ఇక్కడ భారత్ నాణ్యతా ప్రమాణాలు (బీఐఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. కొన్ని రకాల ఆభరణాలకు బీఐఎస్ మార్కును వినియోగిస్తున్నారు. అయితే వినియోగదారులకు ఆభరణాల నాణ్యతను తగిన విధంగా తెలియజేయడం లేదన్నారు. ప్రతిపాదిత నిబంధనల కింద హాల్‌మార్క్‌ను తప్పనిసరి చేయడంతోపాటు ఆభరణాలకు ఉపయోగించే బంగారం క్యారెట్‌ను పేర్కొనాల్సి ఉంటుందని పాశ్వాన్ చెప్పారు. ఆభరణాలకు 14,18,22 క్యారెట్ల మూడు కేటగిరీల్లో హాల్‌మార్కింట్ ఇస్తారని మంత్రి తెలిపారు.

## బిజినెస్

## ఆధార్‌తో మొబైల్ లింక్ తప్పనిసరి

- ఆఖరి గడువు ఫిబ్రవరి 6
- బ్యాంకులకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ :** దేశంలోని అన్ని మొబైల్ నెంబర్లను ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆధార్‌తో మొబైల్‌ను ఫిబ్రవరి 6లోగా అందరూ తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని కేంద్రం ప్రకటించింది. అంతేకాక పాత బ్యాంక్ అకౌంట్లకు ఇది వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానంపై గడువుతేదీలో ఇక మార్పులు ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. అయితే బ్యాంక్ అకౌంట్లకు గడువు తేదీని మాత్రం మార్చి 31 వరకూ ప్రభుత్వం పొడిగించింది. ఆధార్‌తో అనుసంధానం చేయడం అనేది.. వ్యక్తిగత గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టులో వేల సంఖ్యలో పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిని రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. ఇదిలా ఉండగా.. మార్చి31 లోపు ఆధార్‌తో అనుసంధానం చేయని బ్యాంకు ఖాతాలను స్థంభింపచేయాలని ఆయా బ్యాంకులకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## కాలమ్

### గాంధారులు.. ఈ తరం తల్లిదండ్రులు

పిల్లల్ని కన్నారుగాని ఆ పిల్లలు
ఎలాంటి వాతావరణంలో పెరుగుతున్నారు?
వాళ్ళేం చేస్తున్నారు? అని ఒక్కనాడైనా
వాళ్ల గురించి పట్టించుకోని ఈ తరం తల్లిదండ్రులు
గాంధారి, ధృతరాష్ట్రులుగా ప్రవర్తిస్తూ
" చదువులు చంపేస్తున్నాయంటూ తప్పును
చదువుల తల్లి మీద తోసేస్తున్నారు.
"ప్రైవేటు పాఠశాలలు" అన్న విత్తనాలను
ప్రభుత్వాలు ప్రజల మీద చల్లేస్తే
వాటికి కావాల్సినంత నీరు( విదార్థులను
చేర్పించి) పోసింది ఎవరు?? మనం కాదా??
వాటికి కావల్సినంత ఎరువులు(ఫీజు కట్టింది.)
చల్లింది ఎవరు?? మనం కాదా??
అవి ఎండిపోకుండా, వాడిపోకుండా
పగలనక, రాత్రనకా దాన్ని (ట్యూషన్లు,
స్పెషల్ క్లాసులు అంటూ) రక్షిస్తున్నది ఎవరు??
మనం కాదా ??
ఏ ప్రైవేటు పాఠశాలైనా..ఏప్రైవేటు కళాశాలైనా
ఇంట్లో ఉన్న మన పిల్లల్ని మన అనుమతి
లేకుండా బలవంతంగా లాకెళ్ళి చదువు
చెప్పిస్తున్నారా??
పరిచయమున్న ప్రతి ఒక్కరినీ ఏ స్కూల్ బావుందని అడిగి,
లక్షలకు లక్షలు పోసి మరీ మనమేగా మన
పిల్లలను చేర్పిస్తుంది.
ప్రైవేటు పాఠశాలలు పెట్టే ప్రతి అడ్డమైన
కండీషన్లకూ గంగిరెద్దులా తలూపుతున్నది
మనం కాదా?? కాస్త చదువుకునే పిల్లలైతే
కుదిరితే ఉదయం ఆరుగంటలకే ట్యూషన్‌కు పంపుతాం
కుదరకుంటే సాయంత్రం 6 నుండి రాత్రి
9 వరకు ట్యూషన్ లో పడేస్తున్నాం
చదువులో కాస్త వెనకబడిన పిల్లలనైతే ఏకంగా
హాస్టళ్లలోనే కుక్కేస్తున్నాం.
పిల్లల పరిస్థితి ఎలా తయారయ్యిందీ
అంటే...
స్కూల్లో ఉన్నా చదవాలి..ఇంట్లో ఉన్నా చదవాలి
ట్యూషన్లో ఉన్నా చదవాలి..
చివరికి సెలవు రోజుల్లోనూ చదవాలి.
పిల్లల్ని చదువుల యంత్రాలుగా
తయారుచేస్తున్నది మనం కాదా??
చేయాల్సిన తప్పంతా మనం చేసి..
ఒత్తిడంతా పిల్లలపై రుద్ది
ప్రైవేటు పాఠశాలను ఆడిపోసుకోవడం ఎంత
వరకు సమంజసం.?
ఇదంతా ఎవరి కోసం చేస్తున్నాం??
పిల్లల భవిష్యత్తు బావుండాలనే కదా అని
మనల్ని మనం సమర్థించుకోవడం
అందమైన ఆత్మవంచనే అవుతుంది.
చదువు పేరుతో పిల్లల్ని పిండే కొద్దీ చివరకు మిగిలేది పిప్పే.
చదువుకున్నవాడి అదృష్టం బావుండి ఉద్యోగం వస్తే వాళ్ళ
భవిష్యత్తుకు ఢోకా లేదు.
పొరపాటున ఏ ఉద్యోగమూ రాకపోతే
అడుక్కోవడానికి కూడా పనికిరానివాడిగా
తయారు చేసిన వాళ్ళం మనమే అవుతాం....
అవుతున్నాం.....
ఎందుకంటే నేటి విద్యార్థుల్లో నూటికి
తొంభైతొమ్మిది మందికి చదువు తప్ప
(క్రీడలుగానీ,కళలుగానీ) రావు...
నేర్పే ప్రయత్నమూ చెయ్యలేదు...
ఒక్క మాటతో ప్రపంచాన్ని మార్చే శక్తి లేకపోవచ్చు.
ఇందులోని ఏ ఒక్క మాటైనా..
ఏ ఒక్క తల్లి ఆలోచనైనా మార్చగలిగితే
ఏ ఒక్క విద్యార్థి ప్రాణాన్నైనా కాపాడగలిగితే అంతకన్నా
మహాభాగ్యం మరొకటి లేదు.

### ప్రభుత్వ అత్యవసర ఫోన్ నంబర్లు

**ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని సేవలకు మరియు కొన్ని అత్యవసర సేవలకు ఉపయోగపడే కొన్ని ఫోన్ నంబర్స్. ప్రతి ఒక్కరు ఈ ఫోన్ నెంబర్స్ ని మీ దగ్గర ఉంచుకోవడం ఎంతో అవసరం**

| | |
|---|---|
| పోలీసు సేవలకు | - 100 |
| రైల్వే సమాచారం కోసం | - 139 |
| శాంతి భద్రతల కొరకు | - 1090 |
| ఈవ్‌టీజింగ్ | -1091 |
| పిల్లల వేదింపులు | - 1098 |
| ఆర్టీసీ హెల్ప్‌లైన్ | - 18002004599 |
| అత్యవసర వైద్య సేవలు | - 108 |
| తపాల భీమా | - 18001805232 |
| అగ్నిమాపక సేవలు | -101 |
| ఎన్టీఆర్ వైద్య సేవలు | - 104 |
| ప్రభుత్వ కార్యాలయాలలో ఇబ్బందులు | - 155361 |
| ఓటు నమోదు కోసం | - 1950 |
| వ్యవసాయ సమాచారం | - 18001801551 |
| మీసేవ సేవల కోసం | - 1100 |
| టెలికాం సేవల కోసం | - 198 |
| విద్యుత్ సేవల కోసం | - 18004250028 |
| ఉపాధి హామీ పథకం | - 18002004455 |
| ట్రాఫిక్ సమస్యలకు | - 107 |
| అపోలో అంబులెన్స్ కోసం | - 1066 |
| ఎలక్ట్రిసిటీ కప్లైంట్ల్ కోసం | - 1912 |
| ఏపీ సివిల్ సప్లైస్ | -18004252977 |
| ఎయిర్ లైన్ ఎక్వైరీస్ | -1407 |
| ట్రైన్‌లో మహిళల భద్రతా కోసం | - 9003160980 |

## నవంబరు 8

# కష్టజీవుల పాలిటి కాళరాత్రి







11-12-16న ప్రచురితమైన కార్టూన్ (ఫైల్)

గతేడాది నవంబరు 8న ప్రధాని మోడీ అత్యవసర ప్రసంగం రాత్రి 9.30 గంటలకు ఉందని ప్రకటనలు వస్తే అందరూ టీవీలకు అతుక్కుపోయారు.హిందీ ప్రసంగం వచ్చింది.. దక్షిణభారతీయ రాష్ట్రాలకు సగం అర్థం అయ్యి, అవ్వక కింద స్క్రోలింగ్ చూసుకుంటే ఏముంది ? అంతవరకు కష్టపడి దాచుకున్న పెద్దనోట్లు రూ. 1000,500నోట్లు ఎందుకూ పనికిరానివిగా మారిపోయాయని తెలుసుకున్న సామాన్యులు ఘొల్లుమన్నారు. మోడీ ఒక్క మాటతో డబ్బులుండి కూడా ఒక్కసారిగా కష్టజీవులంతా ముష్టివాళ్లగా మారిపోయారు. పెద్ద నోట్లు ఉన్నవారంతా చిల్లర డబ్బుల కోసం వెతుక్కోవలసి వచ్చింది. చిన్నా,చితకా, ముసలీ ముతకా, గర్భిణీలు, వ్యాధిగ్రస్తులు క్యూలైన్లో నిలబడ్డారు. ఏటీయంలన్నీ బంద్ అయ్యాయి.

అత్యధిక జనాలను తట్టుకోలేని బ్యాంకు సిబ్బంది అధికపని, ఒత్తిడికి గుండెపోటు గురై మృతి చెందారు. ప్రజాజీవనం అస్తవ్యస్థం అయింది.

పెళ్లిళ్లు ఆగిపోయాయి, మృతిచెందినవారివద్దకు చేరుకోవడానికి బంధుమిత్రులే కాదు, సొంత వ్యక్తులు కూడా డబ్బు లేక కడసారి చూపులకు నోచుకోలేదు. ఇంత జరిగినా ప్రధాని మోడీ నల్లధనం బయటకు తేవడానికే ఈ తతంగం అని గొప్పలు చెప్పుకుంటారు కాని నిజాన్ని అంగీకరించే సహృదయాన్ని మాత్రం ఆయన చాటుకోలేకపోతుడటం భారతీయుల దౌర్భాగ్యం. కనీసం ఎంపీగా కూడా అనుభవం లేకపోవడం, విభజనవాద రాజకీయాలు, దేశ ఆర్థికవ్యవస్థపట్ల కనీస జ్ఞానం కూడా లేని మోడీకి దేశపగ్గాలు అప్పజెప్పడంతో ఈపరిస్థితి నెలకొంది. ఆర్బీఐ, ఇతర జాతీయబ్యాంకుల అధికారులను, వారి సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్న పరిణితి లేని నాయకుడి ఏకపక్ష నిర్ణయం దేశవాసులను విస్మయపరచడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థను అధోగతిపాలు చేసింది.

నోట్లరద్దుతో నల్లధనం సమసిపోతుందని, ఉగ్రవాదం అంతం అవుతుందని, నల్లకుబేరులకు నిద్రపట్టదని ప్రగల్భాలుపలికిన మోడీ 7 నెలల తర్వాత నోట్లరద్దు తర్వాత 99 శాతం పెద్దనోట్లు బ్యాంకులకు చేరాయని ప్రకటించడం ద్వారా ఆయన ఏ వర్గాలకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారో ఇట్టే అవగతమవుతుంది. పెద్దనోట్లవల్లే నల్లధనం అని తేల్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం రూ. 2000 నోట్లను ముద్రించడం వారి నిజాయితీలో లోపం ఉందని చెప్పకనే చెబుతోంది. నోట్ల రద్దు తర్వాత రెండువేల రూపాయల ముద్రణకు రిజర్వుబ్యాంకు 21వేల కోట్లు ఖర్చుపెట్టింది. కొండను తవ్వి ఎలుకను పట్టిన ప్రభుత్వం రూ.16 వేల కోట్ల నల్లధనాన్ని మాత్రమే నిరోధించగలిగింది.

మురార్జీదేశాయ్ హయాంలో 10 వేల నోట్లను రద్దు చేస్తే 23 శాతం చెలామణిలోకి రాకుండా పోయాయి. ఒక చర్య తీసుకునే ముందు సమగ్ర ప్రణాళిక, అధ్యయనం, నిబద్ధత అవసరం. అదిలేకుండా చేస్తే మోడీ పాలనగా చరిత్రకెక్కుతుంది.

2జీ,3జీ, బొగ్గుస్కాంలతో యూపీఏ ప్రభుత్వంపై నిరసన పెంచుకున్న సామాన్య జనం ఎన్‌డీఏకు అధికారం కట్టబెడితే మోడీ అమలు చేసిన పెద్దనోట్లరద్దు కుంభకోణంతో దేశప్రజలేకాదు, ప్రపంచమే దిమ్మెరపోయింది. మోడీ హయాంలో ఇప్పటివరకు రూ.15 లక్షల కోట్ల బడాపారిశ్రామిక వేత్తలకు రాయితీలు కల్పించడం గుర్తుంచుకోవాల్సిన అంశం. బీజేపీ ఎంత గొంతుచించుకొని నవంబరు 8న బ్లాక్‌మనీడేగా జరుపుకున్నా సామాన్యుడు మాత్రం దాన్ని బ్లాక్‌డేగానే గుర్తించుకుంటాడు. ఎందుకంటే వారు అనుభవించిన బాధలు అటువంటివి.

2016 ఆఖరిత్రైమాసికంలో దేశ వృద్ధిరేటు 9.2 ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ –జూన్ త్రైమాసికంలో 5.7శాతం (అంతకంటే తక్కువగా ఉందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు)

ఉత్తరభారత దేశంలో రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో అనేక ఇబ్బందులకు గురైన రైతులు గతేడాది వరుణదేవుడు కరుణించి పంటలు పండటంతో ఆర్థిక బాధలు తొలుగుతాయనుకున్న సమయంలో మోడీ పిడుగుపాటు ప్రకటనతో హతాషురులయ్యారు. కేజీ కూరగాయలు, పళ్లు పైసలకు కొనేవారు కూడా లేరు. చేతికి వచ్చిన పంట నోటికి రాకుండా పోయింది. తర్వాతి పంట వేయడానికి చిల్లుగవ్వలేక రైతులు నానా అగచాట్లు పడ్డారు. అప్పుడు ధాన్యం మిల్లుల కేసినవారికి ఇప్పటికీ డబ్బులు చేతికిరాక రైతులు గిజగిజలాడుతున్నారు.

నోట్లరద్దు కారణంగా ఎన్నో చిన్నపరిశ్రమలు మూతపడ్డాయి. తద్వారా 15 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఉద్యోగాల కల్పనలో తయారీ, వ్యవసాయం, నిర్మాణరంగాలు కీలక పాత్రపోషిస్తాయి అయితే నోట్లరద్దుతో ఇవన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్‌డీఏ ప్రభుత్వం 2016లో కేవలం 91 వేల ఉద్యోగాలను మాత్రమే కల్పించగలిగింది. వినియోగ తగ్గుదల, ఉత్పత్తుల తగ్గుదలకు, ఉద్యోగాల కోతకు దారితీసింది.

నోట్లరద్దు కార్మికులు ఎక్కువగా పనిచేసే జౌళి, నిర్మాణం, ఆభరణాలు,వజ్రాలు, చర్మాలు,పాదరక్షల తయారీపై విపరీత ప్రభావాన్ని చూపాయి. మోడీ, అమిత్‌షా ఏకపక్ష నిర్ణయాలతో బ్యాంకులు దివాళా దిశలో ఉన్నాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకుండా, తగినంత నగదును బ్యాంకుల్లోను, ఏటీఎంల్లో నిల్వచేయకుండా పెద్దనోట్లరద్దుకు సాహసించడం ద్వారా గంటల తరబడి బ్యాంకులు, ఏటీఎంల ముందు నిలబడి ప్రాణాలు కోల్పోయిన వారికి నవంబరు 8న నివాళి ఘటిస్తామని ప్రకటించిన అన్ని ప్రతిపక్షాలను స్వాగతిద్దాం. నోట్లరద్దు ద్వారా సామాన్యుడికి ఒరిగిన ప్రయోజనమేమిటని ప్రభుత్వాన్ని నిలదీద్దాం..

– ఖాన్

## సమావేశాలు బహిష్కరించడం తప్పే..

# మరి పార్టీ ఫిరాయింపుల మాటేమిటి?

**సభాధ్యక్షుడి అనుమతిలేకుండా 15 రోజుల ముందే సభాకార్యక్రమాలను బహిష్కరించిన శాసనసభ్యులసీట్లను ఖాళీ అని ప్రకటించే హక్కు రాజ్యాంగంలోని 190 అధికరణలో ఉందని దాని ప్రకారం వారిపై అనర్హత వేటు వేస్తామని, ప్రతిపక్షం రాజ్యాంగధిక్కరణకు పాల్పడుతుందని డొక్కా మాణిక్యరావు బీరాలు పలుకుతున్నారుకాని , ఒక పార్టీపై గెలిచి పార్టీకి, అసెంబ్లీస్థానానికి రాజీనామాలు చేయకుండా అధికారపార్టీలో చేరి పదవులను అనుభవించడాన్ని ఏమంటారో చెబితే బాగుంటుంది. అలాగే సభాధ్యక్షుడు కూడా సభాబహిష్కరణల పై వేటు వేసినట్టు ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి వచ్చేదికాదని ప్రజలు భావిస్తున్నారు.**





వైసీపీ శాసనసభ సమావేశాలను బహిష్కరించడం తప్పే .. కాని అందుకు కారణమైన అధికార పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంపై పెదవి విప్పడంలేదు సరికదా బహిష్కరిస్తున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటానికి అధికారపార్టీ దుందుడుకుగా వ్యవహరిస్తోంది. అధికార తెలుగుదేశం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించకుండా, వారి రాజీనామాలను ఆమోదించి, ఎన్నికలు నిర్వహించి ఆపై గెలిచిన వారికి మంత్రి పదవులు కట్టబెడితే రాష్ట్రంలో ఈ రాజకీయ సంక్షోభం ఉండేది కాదు. అలాగే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అకారణంగా సమావేశాలను బహిష్కరిస్తే వారిపై చర్యలు తీసుకున్నా సమంజసంగా ఉంటుంది. అలా కాకుండా ప్రతిపక్షపార్టీలపై గెలిచిన అభ్యర్థులకు పదవులు కట్టపెట్టడం ప్రజాస్వామ్యం ఖూనీగా చెప్పకతప్పదు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల అభ్యర్థనకు ఆయా పార్టీల అభ్యర్థులు ఇంటికి వచ్చినప్పుడు ఏం బాబు ఏపార్టీలో గెలిచావో ఆపార్టీ అధికారంలోకి రాకపోయినా దానిలోనే కొనసాగుతావా ? లేదంటే కేసులున్నాయని, ప్యాకేజీ ఇస్తున్నారనిఅధికార పార్టీలోకి ఫిరాయింపులు జరుపుతావా అని నిలదీయాల్సిన అవసరం ఉంది. దేశంలోనే అత్యధిక రాజకీయ అనుభవం కల నేతగా చంద్రబాబు ఫిరాయింపులను ఎందుకు ప్రోత్సహించారో అంతుబట్టని విషయం ఎందుకంటే ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రజలు స్పష్టమైన మెజారిటీతో గెలిపించారు. దానితో సంతృప్తికరంగా పాలన నిర్వహించవచ్చు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును ఆదర్శంగా తీసుకొని (చంద్రబాబుదగ్గర మంత్రిగా పనిచేసిన) తన రాజకీయ జీవితాన్ని ఎందుకంత మలినం చేసుకున్నారో ఆయనకే తెలియాలి. ప్రతిపక్షాన్ని తీవ్రంగా ఇరుకున పెట్టడానినికే అనుకున్నా చరిత్రలో ప్రజాస్వామ్యాన్ని చెరపట్టిన చంద్రబాబుగా మిగిలిపోతానన్న సృహ ఎందుకు కోల్పోయారో తెలీదు.

మరో నలుగురు ఎమ్మెల్యేలను తెలుగుదేశంలోకి లాగేశారంటే అది ప్రతిపక్షంలో చీలికగా గుర్తిస్తారు. ఇది ఆపార్టీకి తీవ్రమైన దెబ్బ దీంతో వైసీపీ తాడోపేడో తేల్చుకుంటానికి సిద్ధపడి ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీని సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు , మరో మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రంగా మందలిస్తు వారి అలవెన్స్‌లు కట్ చేస్తామని, వారిని బర్తరఫ్ చేస్తామని బీరాలు పలుకుతూసమస్యను పక్కదారి పట్టిస్తున్నారు గాని, అసలు ప్రతిపక్షం ప్రశ్నకు మాత్రం సమాధానం చెప్పడంలేదు.

రాజ్యాధికారం ప్రతిసారీ ఒక్కపార్టీకే సొంతం చేసుకోలేదు. అలాంటప్పుడు అధికార పక్షాలు విలువలను పాటించకపోవడం ఎన్ని అనర్థాలకు దారితీస్తుందో గుర్తించాలి. ప్రజాస్వామ్యాన్ని పాటించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. కేంద్రం మొన్న జరిగిన ఎన్నికల్లో గోవా,మణిపూర్‌లో మెజారిటీ సాధించకపోయినా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యవాదులను నివ్వెరపరిచింది. తమ ఎమ్మెల్యేలను అధికార పక్షం సభ్యులు హైజాక్ చేసి, మంత్రి పదవులు కట్టబెట్టడంపై రాష్ట్ర గవర్నర్లకు, ప్రధానికి, న్యాయస్థానాలకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయంలో జోక్యంచేసుకొని న్యాయం జరపాలని ఇటీవల రాష్ట్రపతికి కూడా వైఎస్ జగన్ ఐదు పేజీల లేఖరాశారు. ఏది ఏమైనా ఒక్కటి మాత్రం నిజం ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడింది. ప్రజలంతా మేల్కోవలసిన సమయం ఆసన్నమైంది.

– ఖాన్






# అసమాన దేశభక్తుడు టిపూ సుల్తాన్

**(నవంబరు 10న ఆయన జన్మదినం సందర్భంగా)**

బ్రిటీషు ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేసి అపూర్వ దేశభక్తిని ప్రపంచానికి చాటిన టిపూసుల్తాన్ భారతమాత ముద్దుబిడ్డ. మాతృభూమి రక్షణకోసం యుద్ధంలో ఇద్దరు బిడ్డల్ని పోగొట్టుకోవడమే కాకుండా, తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన టిపూ 1782 నవంబర్ 10న హైదరాలీ, ఫాతిమా ఫక్రున్నిసాలకు జన్మించారు.



ఆయన పూర్తి పేరు బాద్షా నసీబుద్దిల్లా సుల్తాన్ ఫతేహ్ అలి బహదూర్ సాహెబ్ టిపూ. అందరికీ ఆమోదయోగ్యమైన జీవనశైలి ఆయనది. వివిధ మతాలు, కులాలు కలిగి ఉన్న ప్రజలమధ్య ఐకమత్యం, ఏకత్వం ఉండటంతో టిపూ రాజ్యాన్ని చూసిన ఆంగ్లేయులకు కన్నుకుట్టిందని, అభివృద్ధిలో దూసుకుపోతున్న టిపూతో ఎప్పటికైనా తమకు ముప్పుతప్పదని కుతంత్రాలకు పాల్పడిందని ప్రముఖ చరిత్రకారుడు డెన్నీస్ ఫారెస్టు తన పుస్తకంలో రచించాడు. టిపూకు బలమైన సైన్యం ఉండేది నాలుగు బ్రిగేడ్లుగా విభజింపబడిన సైన్యంలో ఒక్కో బ్రిగేడియన్‌ను 6 రెజిమెంట్లు (కుషూన్)గా, ఒక్కో రెజిమెంట్‌లో ఒకసుబేదార్, సుబేదార్ వద్ద రాకెట్లను ప్రయోగించే సుశిక్షుతుడైన సైనికులు ఉండేవాడు. బ్రిటీషు సైనికుల కంటే బలమైన, ఆధునిక సాంకేతికత రాకెట్లు టిపూ సైన్యంలో ఉండేవి. ఆయుధాలను వేగంగా యుద్ధరంగానికి తరలించడానికి ప్రత్యేక ఎడ్లు ఉండేవని ఇందుకోసం సుల్తాన్ ప్రత్యేక బ్రీడును అభివృద్ధి చేశాడని అప్పటి వైస్రాయి లార్డ్ వెస్లీ ఇంగ్లాండు మహారాణి విక్టోరియాకు రాసిన లేఖలో పేర్కొన్నాడు.

ఫ్రెంచ్‌వారి కోరిక మేరకు ఆయన చర్చిని కట్టించగా, ధనాగారంలోని చాల సంపదను శృంగేరి, మేల్‌కోట, నంజుగళ్, శ్రీరంగపట్నాల పుణ్యక్షేత్రాల్లో హిందూ దేవుళ్ల విగ్రహాలను ప్రతిష్ఠించడానికి వెచ్చించాడు. నంజుగళ్‌లో ఆయన ప్రతిష్ఠించిన దేవతల విగ్రహాలు ఇప్పటికీ పూజలందుకుంటున్నాయి. ఆయన హయంలో దాదాపు 40వేల మంది బ్రాహ్మణులకు అగ్రహాలు, ఆదాయవనరులు కల్పించారని చరిత్రకారులు చెబుతున్నారు. టిపూ తండ్రి హైదరాలీకి చదువు లేకపోవడంతో కుమారుడి చదువుపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. టిపూ అరబ్బీ, పార్సీ, హిందీ, కన్నడ, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ భాషల్లో నిష్ణాతుడు. టిపూ మరణానంతరం ఆయన వ్యక్తిగత గ్రంధాలయంలోని 2000 పుస్తకాలను బ్రిటీషువారు ఇంగ్లాండులోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీలకు తరలించారు. వాటిలో అంతరిక్షం, న్యాయశాస్త్రం, గణిత శాస్త్రపుస్తకాలున్నాయి. కొన్ని పుస్తకాలు మాత్రం కలకత్తాలోని రాయల్ ఆసియాటిక్ సొసైటీ భద్రపరిచింది.

బ్రిటీషువారు ఆయనను కుత్రపూరితంగా హత్యచేసిన తర్వాత టిపూ ప్రయోగించిన రాకెట్లను ఇంగ్లాండుకు తరలించి వాటిని పరిశీలించి, పరిశోధనలు జరిపి టిపూపై యుద్ధానికి నాయకత్వం వహించిన కాంగ్రీవ్ పేరుతో 1806లో అభివృద్ధి చేసింది. 1799 మే 4న వీరమరణం పొందిన టిపూ వీరత్వం గురించి ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ప్రజలు గొప్పగా చెప్పుకున్నారు. టిపూ మృతి నాటికి ఇంగ్లాండులో ఉన్న రాజారామ్మోహన్‌రాయ్ ఆయన మరణంపై ఎంతగానో కలత చెందారు. భరతమాత ఒక దేశభక్తుడిని కోల్పోయిందని వగచారు. ప్రపంచంలోనే అత్యున్నత అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా టిపూను మొదటిరాకెట్ మేన్‌గా గుర్తించి ఆయన పెయింటింగ్‌ను నెలకొల్పడం భారతీయులకు గర్వకారణం.

– బోస్



# వేయి లాభాల ఉసిరి

ఈ కార్తీక మాసంలో వనభోజనాలు చేస్తారు. ఉసిరి చెట్టు కిందనే ఈ భోజనాలు చేస్తుంటారు. ఇంత పవిత్రంగా చూసే ఈ ఉసిరిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఉసిరి లో నీరు, పీచు శాతం కుడా ఎక్కువే. ఈ రెండు జీర్ణ శక్తిని పెంచుతాయి. యాంటీ జీర్ణ శక్తి పెంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, సమృద్ధిగా వుండే ఉసిరికాయను ఆహారంలో తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఉసిరి లోని కాల్షియం తోడ్పడుతుంది. ఉసిరి లోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ కణాలను కాంతివంతంగా ఉంచుతాయి. వయస్సు పైబడిన లక్షణాలు కన్పించనీయవు. రక్తాన్ని శుద్ధి చేస్తుంది ఉసిరి. అన్నింటికంటే ముఖ్యం జుట్టుకు ఉసిరి చేసే ఉపకారం ఇంకేదీ చేయలేదు. జుట్టు నల్లబరిచేందుకు చక్కగా ఎదిగేందుకు, జుట్టును పరిరక్షించేందుకు ఉసిరి ఎన్నో విధాలుగా పనికి వస్తుంది. ఉసిరిని నిల్వ చేసుకుని సంవత్సరం పొడుగునా రోజు ఒక కాయ తింటే ఆరోగ్య పరంగా ఎంతో లాభం.




Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com